క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఈఓగా సుధాకర్



ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా కందుల సుధాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న సుధాకర్‌కు ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇన్‌చార్జ్ ఈఓగా పనిచేసిన అద్దంకి నాగేశ్వర్‌రావును ఎండోమెంట్ అధికారులు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు ఆలయ అర్చక సిబ్బందితో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

ఎల్కతుర్తి : ఈనెల 27వ తేదీన ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. మండపం ఏర్పాటు కోసం అనుమతి తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు పాటించాలని, రోడ్లు బ్లాక్ అయ్యేలా మండపాలు ఏర్పాటు చేయొద్దని తెలిపారు. డీజే సౌండ్స్‌కు అనుమతి లేదని, రాత్రి 10గంటల తర్వాత మైక్ వినియోగించొద్దని సూచించారు.

బీజేపీ నాయకుల పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉప్పు రాజు తల్లి సమ్మక్క గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సమ్మక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం సమ్మక్క కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు మొగిలి, రవికిరణ్, నాగరాజు, నరహరిశెట్టి రామకృష్ణ, రాజశేఖర్, తిరుపతి, సుమన్, రాకేశ్‌రెడ్డి, నవీన్, రంజిత్ ఉన్నారు.

నేడు మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేటలో నిర్మించిన మారెమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన నేడు (శుక్రవారం) జరగనుంది. మోతె వంశస్తులు మారెమ్మ విగ్రహాన్ని ఆలయ దాతలు మోతె అరుణాదేవి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఊరేగించారు. అమ్మ వారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడారు. వందేళ్ల క్రితం మోతె వంశస్తులు నిర్మింపజేసిన ఆలయాన్ని పునర్నిర్మించడం చరిత్రాత్మకమని చెప్పారు. పూజారి బందెల రామస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందని తెలిపారు. భక్తులు, ప్రజలు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో భక్తులు మోతె సంపత్‌రెడ్డి, మోతె నరేందర్ రెడ్డి, మోతె రాజశేఖర్‌రెడ్డి, మోతె వేణుప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

గీసుకొండ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు ఆకాంక్షించారు. మండలంలోని వంచనగిరి, బొడ్డుచింతలపల్లి, శాయంపేట హవేలి గ్రామాల్లో పార్టీ మండల సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి నాయకులు, కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కాంగ్రెస్ అనేక మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి తదనంతరం విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని శ్రేణులను కోరారు. సమావేశంలో పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు ముంత రాజయ్య, బోడకుంట్ల ప్రకాశ్, అంకతి నాగేశ్వర్‌రావు, పూండ్రు జయపాల్‌రెడ్డి, నాయకులు కంబాల కోటి, గుర్రం రఘు, కొల్లూరి రవీందర్, సిరిసె శ్రీకాంత్, లెనిన్, ప్రమోద్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుతో హాస్టళ్లు నిర్వీర్యం

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వ తీరుతో హాస్టళ్లు నిర్వీర్యమవుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేశ్ ధ్వజమెత్తారు. ఆ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ హాస్టల్‌ను గణేశ్, నాయకులు గురువారం సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీల పెంపు, ఇతర అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నామమాత్రంగా పెంచి మోసపూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచలేదన్నారు. హాస్టళ్లలో విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం



రోడ్డుకిరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, నిలిచిన వరద నీరు



రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం

- పెరిగిన దోమల వ్యాప్తి
- రోగాల బారిన పడుతున్న స్థానికులు
- తొంగిచూడని పంచాయతీ అధికారులు
- పట్టించుకోని స్పెషల్ ఆఫీసర్

శాయంపేట : మండల కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్తాచెదారంతో పాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో వరద నీరు నిలిచి దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. దీంతో స్థానికులు వ్యాధుల బారిన పడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. మండల కేంద్రం నుంచి ఆత్మకూరు వెళ్లే రోడ్డుకిరువైపులా చెత్త కుప్పలుగా దర్శనమిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించినా సంబంధిత అధికారులు సిబ్బందికి చలనం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.



పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ యంత్రం

నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రం

ప్రజలు దోమల బారీన పడకుండా ఉండేందుకు పంచాయతీ అధికారులు ఫాగింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం గ్రామంలో దోమల వ్యాప్తి పెరగడంతో ఫాగింగ్ చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మండల ప్రత్యేకాధికారి సైతం గ్రామాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యంపై పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దోమల బెడద నుంచి రక్షించాలి



వర్షాల కారణంగా దోమల వ్యాప్తి పెరిగింది. పంచాయతీ అధికారులు ఫాగింగ్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫాగింగ్ చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

\- రాజశేఖర్, శాయంపేట

ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలి

- విద్యుత్‌శాఖ ఏఈ చందూలాల్

శాయంపేట : గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే కమిటీ సభ్యులు విద్యుత్‌శాఖకు సహకరించాలని ఏఈ చందూలాల్ గురువారం కోరారు. వినాయక విగ్రహాలకు విద్యుత్ వైర్లు తగలకుండా విద్యుత్ స్తంభాల మరమ్మతు, ఎక్కువ ఎత్తుగా ఉండే స్తంభాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని దేవుని చెరువు కట్ట కింద, పోలీస్ స్టేషన్ సమీపంలో ఎక్కువ ఎత్తు గల స్తంభాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గణపతి మండపాల నిర్వాహకులు విద్యుత్‌శాఖ అనుమతి తీసుకుని విద్యుత్ వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జేఎల్‌ఎం విష్ణు, సిబ్బంది ఉన్నారు.



విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పీఎంజేజేబీవై బీమా చెక్కు అందజేత

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన మాసు వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా మండల కేంద్రంలోని కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల బీమా చెక్కును గురువారం అందించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ పేరాల సంపత్ రావు, బ్యాంకు మేనేజర్ మంద స్రవంతి మాట్లాడుతూ.. కేడీసీసీ ఖాతాదారుడైన వెంకటేష్ ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో బ్యాంక్‌లో బీమా పాలసీ పొందినట్లు తెలిపారు. వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పీఎంజేజేబీవై పథకం కింద అతనికి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును మృతుడి భార్య మాసు మౌనికకు అందించామన్నారు. ప్రతి ఖాతాదారుడు రూ.456 చెల్లించి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకంలో బీమా పొందాలని అన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ మోడెం ప్రవీణ్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



మౌనికకకు చెక్కు అందజేస్తున్న సంపత్‌రావు, స్రవంతి

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



డైరీలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

ఆత్మకూరు : విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లోని విద్యార్థులకు గురువారం డైరీలను పంపిణీ చేశారు. పాఠశాల జూనియర్ అసిస్టెంట్ భాగ్యమ్మ తన మనవడు రిహాన్ మెస్సీ పుట్టినరోజును పురస్కరించుకుని డైరీలు అందించడం అభినందనీయమని అన్నారు. డైరీ ద్వారా విద్యార్థుల్లో రచన నైపుణ్యం, పఠన శక్తి పెంపొందుతుందన్నారు. ప్రతిఒక్కరూ డైరీ రాయడం అలవర్చుకోవాలన్నారు. హెచ్‌ఎం నిర్మలకుమారి, ఉపాధ్యాయులు సమత, రాజు, సోమయ్య, రజితాదేవి, సుజాత, జోసెఫిన్, వసంత, ప్రసూన, రవి శేఖర్, భాగ్యమ్మ, స్వప్నతో పాటు తదితరులు పాల్గొన్నారు

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

ఆత్మకూరు : రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్, లింగమడుగుపల్లె గ్రామాల్లో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి పనులు మాత్రమే ఇప్పటికీ కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందని, ప్రజలంతా బీఆర్‌ఎస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, నాయకులు రవియాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్ కేశవరెడ్డి, రాజేశ్వరరావు, వంశీ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సాంబయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

పరకాల : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025–2026 విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించినట్లు పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్ తెలిపారు. గురువారం పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ లేదా తత్సమాన విద్యను పూర్తిచేసిన విద్యార్థులు బీఏ, బీకామ్, బీఎస్సీలో చేరేందుకు ఈనెల 30వ తేదీ లోపు అడ్మిషన్లు పొందాలని సూచించారు. అనంతరం బీఆర్‌ఏఓయూ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆడెపు రమేశ్ మాట్లాడుతూ.. ఇంటిదగ్గర, ఇతర ఉపాధి పనులు చేసుకుంటూ విద్యను అభ్యసించాలనుకునే వారికి బీఆర్ ఏఓయూ దూరవిద్య మంచి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అలాగే ఫీజు చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చేయాలని సూచించారు. ఈ క్యాక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎలిశాల అశోక్, డాక్టర్ దుప్పటి సంజయ్, సీనియర్ అసిస్టెంట్ ఆరుట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైకల్య నిర్ధారణ పరీక్షలు

పరకాల : పట్టణంలో శనివారం అంగవైకల్య విద్యార్థులకు వైకల్య నిర్ధారణ పరీక్షలతో పాటు భారత ప్రభుత్వ కృత్రిమ అవయవ సంస్థ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్హులైన విద్యార్థులు వైద్య నిపుణులు జారీ చేసిన ధ్రువపత్రాలతో హాజరై వైకల్యస్థాయి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వివరాలకు రమాదేవి (ఐఈఆర్‌పీ) మొబైల్ నంబర్ 7287994980 సంప్రదించాలని కోరారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

శాయంపేట : మండల కేంద్రంలోని తెలుగు వీధికి చెందిన మామిడి అరుణపై కోతులు దాడిచేయగా తీవ్రంగా గాయపడ్డారు. ఇంటి ఆవరణలో ఉండగా ఒక్కసారిగా కోతులు గుంపుగా వచ్చి దాడిచేశాయి. దీంతో ఆమె చేయికి తీవ్ర గాయమైంది. చుట్టుపక్కలవారు కేకలు వేయడంతో అక్కడినుంచి కోతులు వెళ్లిపోయాయి. అరుణకు తీవ్ర రక్తస్రావం అవడంతో స్థానికులు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అక్రమ మొరం రవాణాకు అడ్డుకట్ట వేయాలి

నడికూడ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరుతో అక్రమంగా మొరం రవాణా చేస్తున్నారని, అధికారులు అడ్డుకట్ట వేయాలని రాయపర్తి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాజిరెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొందరు అక్రమంగా మొరాన్ని తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై రాజు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని ములకనూరు ఎస్సైగా ఎం.రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై సాయిబాబు వర్ధన్నపేటకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే.

వసంతాపూర్‌లో ఈ-సర్వే

శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామంలో గురువారం పంచాయతీ కార్యదర్శి గంగారపు సుమన్ ప్రధానమంత్రి అవాస్ యోజన గ్రామీణ ఈ–సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేశారు.

మాజీ ఎమ్మెల్యే 'పెద్ది' వ్యాఖ్యలు అర్థరహితం

నర్సంపేట : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అవగాహనారాహిత్యంతో వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ అన్నారు. చెన్నారావుపేటలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కొరతపై ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమీక్షించడం లేదంటూ పెద్ది చేసిన వ్యాఖ్యలను రమేశ్ ఖండించారు. కేంద్ర ప్రభుత్వం యూరియా అందించడంలో నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. కేంద్రం నుంచి ఏప్రిల్‌లో రాష్ట్రానికి రావాలిసినంత కంటే తక్కువ యూరియా అందిందని తెలిపారు. అవగాహన లేకుండానే పెద్ది రైతులను ఉసిగొల్పి రోడ్డుపై బైఠాయించి అధికారుల కాళ్లు మొక్కించి సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలోని అన్ని 29రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వమే యూరియా సరఫరా చేస్తుందని, బీజేపీ పాలిత రాష్ట్రాలకు సరిపడా అందిస్తూనే తెలంగాణకు తక్కువగా పంపిస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్షవీడి సరిపడా యూరియా అందించి కొరత నివారించాల్సి ఉందన్నారు.

పత్తిపంటలో వేపనూనె పిచికారీ చేయాలి

- శాస్త్రవేత్త డాక్టర్ విజయభాస్కర్

ధర్మసాగర్ : పత్తి సాగు చేసే రైతులు వారి వ్యవసాయ క్షేత్రంలో వేప నూనె పిచికారీ చేయాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయభాస్కర్ సూచించారు. మండలంలోని దేవునూరు, ధర్మపురం, ముప్పారం గ్రామాల్లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్ శాస్త్రవేత్తల బృందం గురువారం వివిధ పంట పొలాలను సందర్శించింది. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ.. పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రసం పీల్చే పురుగులు వ్యాప్తిచెందుతాయని వాటి నివారణకు వేప నూనె (1500 పీపీఎం) ఎకరాకు లీటర్ చొప్పున, అస్ఫేట్ ఎకరాకు 300 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. 1:20 నిష్పత్తిలో ఫ్లనికామైడ్ మందును నీటిలో కలుపి బొట్టు పెట్టే పద్ధతి ద్వారా లేత కాండానికి పూయాలని సూచించారు. పంట సాగులో సందేహాలు ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ విశ్వతేజ, ఏఓపీ రాజేష్, ఏఈఓలు పవన్, హరీశ్, అభ్యుదయ రైతులు ఉన్నారు.



పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



జేసీబీతో ముళ్లపొదలు తొలగిస్తున్న పోలీసులు

కమలాపూర్ : ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ఎస్సై వీరభద్రరావు అన్నారు. మండలంలోని ఉప్పల్ నుంచి కమలాపూర్ వరకు రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను, ముళ్లపొదలను గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఉప్పల్–కమలాపూర్ ప్రధాన రహదారికిరువైపులా చెట్లు, ముళ్లపొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయని అన్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలుసుకుని చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలను తొలగించినట్లు చెప్పారు. వాహనదారులు సైతం రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ చేయాలి

ధర్మసాగర్ : గొర్రెలు, మేకలకు వెంటనే నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని, ప్రభుత్వ భూములను గుర్తించి మేత కోసం గొర్రెల కాపర్ల సొసైటీలకు ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ సదానందానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు గొర్రెలు, మేకలకు సంవత్సరానికి మూడుసార్లు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామని చెప్పి 20 నెలలు అవుతున్నా ఒక్కసారి కూడా పంపిణీ చేయలేదన్నారు. డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సంఘం మండల అధ్యక్షుడు భీమన్న, నాయకులు పరుశురాములు, కుమారస్వామి, శ్రీకాంత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల కాపరులు

పల్లె దవాఖానా ప్రారంభానికి సిద్ధం చేయండి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

సాక్షి ఎఫెక్ట్..

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు పల్లె దవాఖానా నూతన భవనం ప్రారంభించకపోవడంతో సిబ్బంది గ్రామపంచాయతీ ఆవరణ నుంచి వైద్య సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. స్థానికులు, వైద్యసిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యపై ఈనెల 17వ తేదీన సాక్షి దినపత్రికలో 'పల్లె దవాఖానా..ప్రారంభమెప్పుడో?' అనే కథనం ప్రచురిమైంది. దీంతో డీఎంహెచ్‌ఓ అప్పయ్య స్పందించారు. గురువారం ఆయన పల్లె దవాఖానా భవనాన్ని పరిశీలించారు. శుక్రవారం భవనాన్ని ప్రారంభించాలని, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన సాక్షికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సౌండ్ సిస్టం, ఆంపిల్ వైర్ మార్పిడైన విషయం తెలిసిందే. కాగా గురువారం సాక్షి దినపత్రికలో 'సేమ్ టుసేమ్ క్వాలిటీ చేంజ్' అనే కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో గల సౌండ్ సిస్టం, ఆంపిల్ వైర్ మార్పిడి జరిగిందని, గ్రామ పంచాయతీలో పని చేసే సిబ్బందిని విచారించి రికవరీ చేయాలని ఫిర్యాదులో కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



శాయంపేట : రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్



వేలేరు : పీచరలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మేఘన

శాయంపేట : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలని సూచించారు. మండలంలోని పాఠశాలల్లో, గురుకులాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాల చుట్టూ నీరు నిల్వకుండా, పాత కుండీల్లో నీరు నిల్వ ఉంచొద్దని ప్రజలకు సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తిచెంది డెంగీ, మలేరియా ప్రబలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణతో పాటు సిబ్బంది ఉన్నారు.

వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

వేలేరు : మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మేఘన కోరారు. వైద్యాధికారులను ఐదు టీమ్‌లుగా విభజించి మండలంలోని పీచర, గొల్లకిష్టంపల్లి, లోక్యాతండా, శాలపల్లి, కన్నారం గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జ్వరపీడితులకు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.